సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 28 । అక్టోబర్ । 2022

ప్రకృతి అందాలు కనువిందు



అరకులోయ మండలంలోని మాడ గడ కొండలపై మంచు అందాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. వంజంగి హిల్స్, చెరువులవేనం మాదిరిగానే ఇక్కడి ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి.

– సాక్షి, పాడేరు

వంజంగి హిల్స్‌పై టోల్‌గేటు

- ఏర్పాటుచేసిన పోలీసుశాఖ
- సాయంత్రం ఐదు గంటల నుంచి వాహనాలు నిలిపివేత

8లో



న్యూస్‌రీల్

చింతూరు సబ్ కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



చింతూరు: కొత్తగా ఏర్పాటు చేసిన చింతూరు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్‌గా 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. హర్యానాకు చెందిన అహ్మద్‌ఖాన్ శిక్షణలో భాగంగా ఏడాది పాటు నెల్లూరు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన చింతూరు రెవెన్యూ డివిజన్ తొలి సబ్ కలెక్టర్‌గా నియమితులయ్యారు.

108లో సుఖ ప్రసవం



శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న ఈఎంటీ శ్రీను

జి.మాడుగుల: పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మగ శిశువుకు జన్మనిచ్చింది. మండలంలో బొయితిలి గ్రామానికి చెందిన కె. స్వాతి గురువారం పురిటి నొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. మద్దిగరువు నుంచి 108 వాహనంలో ఆమెను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో బొక్కెళ్ల గ్రామం వద్ద ప్రసవించినట్టు ఈఎంటీ శ్రీను తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, ఇద్దరినీ వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించినట్టు ఆయన చెప్పారు.

31న మినీ జాబ్ మేళా

- శరభన్నపాలెంలో నిర్వహణ
- అరకు ఎంపీ మాధవి



కొయ్యూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 31న మండలంలోని శరభన్నపాలెంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అరకు ఎంపీ మాధవి తెలిపారు. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. శరభన్నపాలెం ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆమె వివరించారు. ఈ మేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారని, ఈ అవకాశాన్ని గిరి యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

30న రెండవ విడత సత్యదీక్షల మాలధారణ

అడ్డతీగల: ఈనెల 30వ తేదీన రెండవ విడత సత్యదీక్షల మాలధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య తెలిపారు. 18 రోజుల దీక్షలకు సంబంధించి మాల ధరించే భక్తులు అదేరోజు ఉదయం 9 గంటల సమయానికి పవనగిరి క్షేత్రంలోని రుషిపీఠం కల్యాణ మండపం వేదిక వద్దకు రావాలని ఆయన కోరారు. తొమ్మిది రోజుల దీక్ష చేపట్టే వారికి వచ్చే నెల 7వ తేదీన మాలధారణ ఉంటుందని చెప్పారు. ఇరుముడుల వచ్చేనెల 16వ తేదీ ఉదయం నిర్వహిస్తామని చెప్పారు. దీక్షలు స్వీకరించదలచిన భక్తులు ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీతో పవనగిరి క్షేత్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

మారేడుమిల్లి: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పరిధిలోని ఆరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో గెస్ట్ టీచర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఏకలవ్య పాఠశాల కనీ వ్వనర్ ఎంవీ. రమణ గురువారం తెలిపారు. పీజీటీ విభాగంలో ఇంగ్లిష్, గణితం, భౌతిక, రసాయన ,అర్థ, జీవశాస్త్రం, చరిత్ర, పొలిటికల్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్ట్‌లకు సంబంధించి రెండేసి చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే టీజీటీ విభాగంలో ఇంగ్లీష్, తెలుగు, హిందీ, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్ట్‌లకు పదేసి పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. బీఈడీ లేదా టెట్ అర్హత గల అభ్యర్థులు రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలోని గురుకులం సెల్‌లో నేరుగా దరఖాస్తులు అందజేయాలని ఆయన సూచంచారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28 నుంచి 31వ తేదీలోపు సమర్పించాలని ఆయన కోరారు. వివరాలకు 8985130458, 9490876026 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిరిలో బంతి సిరులు

జిల్లాలో గిరి రైతులకు బంతి సాగు మంచి ఆదాయ వనరు. బంతి పూలకు ఏటా కార్తీక మాసంలో మంచి డిమాండ్ ఉంటుంది. ఈ ఏడాది పూల ధర అమాంతం పెరగడం రైతులకు కలిసొచ్చింది. ఏటా కార్తీక మాసంలో పూల వ్యాపారం భారీగా జరుగుతోంది. బంతి పూలను పాడేరు మార్కెట్‌కు తీసుకువచ్చి గిరి రైతులు విక్రయిస్తున్నారు. సీజన్ ప్రారంభంలోనే మంచి ధర లభిస్తుండటంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది.



పాడేరు మార్కెట్ వ్యాపారులు కొనుగోలు చేసిన బంతి పూలు

- రైతుకు మంచి ఆదాయ వనరు
- సీజన్ ప్రారంభంలో మంచి ధర
- నాణ్యత వల్ల పోటీపడి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- పాడేరు కేంద్రంగా భారీగా పూల వ్యాపారం

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో పూర్వం నుంచి గిరి రైతులు సీతమ్మకాటుక రకం (చిన్న) బంతిని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో బంతితోటలు విరగబూశాయి.ప్రస్తుత కార్తీక మాసంలో ఈ పూలకు మంచి ఉండటంతో అమ్మకాలు జోరందుకున్నాయి. స్థానిక పాట బస్టాండ్ మార్కెట్లో వారం రోజుల నుంచి అమ్మకాలు భారీగా జరుగుతున్నాయి. స్థానిక వ్యాపారులు పోటీపడి గిరి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధర కూడా లాభదాయకంగా ఉందని గిరి రైతులు తెలిపారు. నాలుగు కిలోల బరువు గల బంతి పూల బుట్టకు రూ.200 నుంచి రూ.300 ధర లభిస్తోంది.

వంద ఎకరాల్లో..

జిల్లాలో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు మండలాల్లో సుమారు వంద ఎకరాల్లో గిరి రైతుల సీతమ్మ కాటుకు రకం బంతిని పండిస్తున్నారు. ఏటా అక్టోబర్ నుంచి జనవరి వరకు నాలుగు నెలలపాటు బంతి పూల వ్యాపారం జరుగుతుంది. ఈ సాగుకు పెట్టుబడి పెద్దగా అవసరం లేదు. కొంతమంది రైతులు ఖాళీ స్థలాల్లో, చిన్న చిన్న కమతాల్లో కూడా సాగు చేస్తున్నారు. మార్కెట్లో ధరలు ఎలా ఉన్నా రోజుకు రూ.600 వరకు ఆదాయం వస్తోందని గిరి రైతులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున దిగుబడి బాగుందని వారు పేర్కొన్నారు.



బరిసింగి ప్రాంతంలో బంతి తోటలు

కిలో రూ.100 నుంచి రూ.150..

పాడేరు మార్కెట్లో బంతి పూలను వ్యాపారులు కొనుగోలు చేసి ఆనందపురం, విశాఖపట్నం, గాజువాక, రాజమండ్రి, కడియపులంక, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, హైదరాబాద్ మార్కెట్లకు తరలిస్తున్నారు. తేలికపాటి గోనె సంచుల్లో ప్యాకింగ్ చేసి పంపిస్తున్నారు. అక్కడి మార్కెట్లలో కిలో బంతిపూలకు రూ.100 నుంచి రూ 150 ధర లభిస్తోందని రైతులు తెలిపారు. పూల అమ్మకాలకు ప్రత్యేక గుర్తింపు ఉన్న కడియపు లంక పూల మార్కెట్‌కు ఇక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో తరలిస్తున్నారు.



పాడేరు మార్కెట్‌కు బుట్టలతో బంతి పూలను తీసుకువస్తున్న గిరి రైతులు

ఆర్థికంగా ఆదుకుంటోంది



బంతి సాగుకు ఏటా పండించిన పూలలో కొన్నింటిని మినహాయిస్తాం. వీటిని ఎండబెట్టి భద్రంగా దాచి సాగుకు వినియోగిస్తాం. ప్రస్తుతం మార్కెట్లో బంతిపూల ధర బాగుంది. రెండు రోజుల నుంచి బుట్ట పూలను రూ.300కు అమ్ముతున్నా. ఈ సాగుకు పెట్టుబడి లేకపోవడం వల్ల ఆర్థికంగా ఆదుకుంటోంది. సీజన్ ప్రారంభంలో మంచి ధర ఉంది.

–మజ్జి కొండమ్మ, ఇరడాపల్లి, పాడేరు మండలం

రికార్డు స్థాయిలో పూల ధర



మైదాన ప్రాంత మార్కెట్లలో ఏజెన్సీ బంతికి మంచి డిమాండ్ ఉంటుంది. ఇక్కడ పండించే బంతి రెండు మూడు రోజులు నిల్వ ఉంటుంది. అందువల్ల పెద్దగా నష్టపోవాల్సిన పరిస్థితి ఉండదు. మార్కెట్లో ధరలు హెచ్చుతగ్గులు ఉండటం సహజం. వ్యాపారుల ఆర్డర్ మేరకు పూలను కొనుగోలు చేసి పంపిస్తాం. సీజన్ ప్రారంభంలో రికార్డు ధర ఉంది.

–వెంకట అప్పారావు, పూల వ్యాపారి, పాడేరు

గిట్టుబాటు ధర కల్పనకు కృషి

జిల్లా ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులు రమేష్, నందు

కొయ్యూరు: కాఫీ,జీడి, మిరియం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఉద్యానవనశాఖాధికారి రమేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి నందు తెలిపారు. గురువారం వారు మండలంలోని సింగవరం రైతుభరోసా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతులు మధ్యవర్తుల ప్రమేయాన్ని తగ్గించుకోవడం ద్వారా గిట్టుబాటు ధర పొందవచ్చునని సూచించారు. ఏదొక కంపెనీతో రైతు ఉత్పత్తి సంఘాలు ఒప్పందం చేసుకుంటే వారికి నేరుగా విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. దీని మూలంగా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. గతేడాది పాచిమెంట్ రకం కాఫీని తక్కువకు ధరకు విక్రయించారని,ఈ ఏడాది కిలో రూ.240కు విక్రయించేలా రైతులంతా ప్రణాళిక పరంగా ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడటం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించారు. జీడి రైతులు ప్రైవేట్ కంపెనీలతో మంచి ధర పొందేలా ఒప్పందం చేసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఏవో కృష్ణవేణి, స్థానిక ఉద్యానవనశాఖాధికారి పాల్గొన్నారు.



రైతులతో సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ఉద్యానవన, వ్యవసాయశాఖ అధికారులు

లక్ష్యాన్ని అధిగమించాలి

- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- చింతపల్లిలో ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ ప్రారంభం



చింతపల్లిలో కాఫీ పల్పింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న పీవో రోణంకి గోపాలకృష్ణ

చింతపల్లి రూరల్: కాఫీ దిగుబడిలో గిరిజనులు లక్ష్యాన్ని అధిగమించాలని పీవో రోణంకి గోపాలకృష్ణ సూచించారు. గురువారం ఆయన చింతపల్లి ఎకో పల్పింగ్ యూనిట్‌ను ఆయన సందర్శించారు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కాఫీ పండ్ల శుద్ధీకరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది చింతపల్లి ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్ ద్వారా ఐదు వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దీనిని గిరి రైతులు సద్వినియోగం చేసుకొని మంచి ఆదాయం పొందాలని ఆయన సూచించారు. కాఫీ సాగు విస్తరణతోపాటు నాణ్యత దిగుబడుల పెంపుపై రైతులు శ్రద్ధ వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ రాజు, డీఈ చాణుక్య, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు సేగ్గి కొండలరావు, గాము సింహాచలం, అడపా విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలు అందేలా చర్యలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో అన్ని మండలాల్లో 108 ద్వారా అత్యవసర సేవలు అందేలా చర్యలు తీసుకున్నామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. ఐటీడీఏ ప్రాంగణంలో శుక్రవారం 108 వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 108 వాహనం ద్వారా ఫోన్ చేసిన వెంటనే అత్యవసర సేవలు అందిస్తున్నారన్నారు. ప్రతి మండలంలో 108 సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్న పిల్లల కోసం శిశు సంజీవని వాహనం అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో అనూష, డాక్టర్ రాధిక, 108 మేనేజర్ మహేశ్వర్, హెచ్ఎంసీ అధికారి ఝాన్సీ పీటర్ తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో 108ను ప్రారంభిస్తున్న పీవో సూరజ్ గనోరే

బరిలో దిగితే పతకమే!

- పరుగు పోటీల్లో రాణిస్తున్న గిరి యువకుడు లోహిత్
- జాతీయస్థాయిలో పలు పతకాల సాధన

అరకులోయ రూరల్: పరుగు పోటీల్లో గిరి యువకుడు శెట్టి లోహిత్ విశేష ప్రతిభ కనబరుస్తున్నాడు. పాఠశాల స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు సాధిస్తూ సత్తా చాటుతున్నాడు. ఆర్థిక సహకారం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానని తెలిపాడు.

కుటుంబ నేపథ్యం..

డుంబ్రిగుడ మండలం తూటంగి గేదెలబంద గ్రామానికి చెందిన శెట్టి లోహిత్‌ది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు శెట్టి సంజీవరావు, ప్రేమమల్లి. ఐదో తరగతి నుంచి టెన్త్ వరకు అరకులోయ క్రీడాపాఠశాలలోనే చదువుకున్నాడు. కొంతమంది ప్రోత్సాహంతో ప్రస్తుతం గుంటూరులో సాయి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో శిక్షణ పొందుతూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అరకులోయ స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్నప్పుడు ప్రిన్సిపాల్ మూర్తి పూర్తిస్థాయిలో సహకారం అందించారని, కోచ్ గణపతి, వినయ్ ప్రసాద్ వద్ద శిక్షణ పొందినట్టు లోహిత్ తెలిపాడు.

సాధించిన పతకాలు

- గుంటూరులో 2018లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 600 మీటర్ల విభాగంలో ద్వితీయస్థానం.
- కర్నాటకలో 2019లో జరిగిన జాతీయ స్థాయి 600 మీటర్ల పరుగు పందెంలో రెండో స్థానం.
- ఢిల్లీలో 2019 జాతీయస్థాయి మీట్‌లో 600 మీటర్లు అండర్-14 విభాగంలో తృతీయ స్థానం.
- కేరళలో 2020లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో 300 మీటర్లు అండర్ 16 విభాగంలో ద్వితీయ స్థానం
- ఢిల్లీలో 2021లో జరిగిన జాతీయస్థాయి మీట్ 400 మీటర్ల అండర్-16 విభాగంలో తృతీయ స్థానం
- గుంటూరులో ఈ ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ పోటీలో 200, 400 మీటర్ల పరుగు పందెం విభాగంలో ప్రథమస్థానం.



గుంటూరులో బంగారు పతకం అందుకుంటున్న లోహిత్

ఆర్థికంగా ప్రోత్సహిస్తే మరింత రాణిస్తా



దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందించి పోత్సహిస్తే ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తాను. ఆర్థిక సహకారంలేక పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేకపోతున్నా. ఐటీడీఏ ప్రోత్సాహం అందించాలి.

–శెట్టి లోహిత్, జాతీయ స్థాయి క్రీడాకారుడు

అదను చూసి.. దోచేశారు

ధారకొండ ఘాట్ రోడ్డులోని ప్రముఖ పుణ్యక్షేత్రం ధారాలమ్మ ఆలయంలో భారీ దోపిడీ సంచలనం సృష్టించింది. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా ఇక్కడి వస్తుంటారు. అదేస్థాయిలో అమ్మవారికి కానుకలు సమర్పించుకుంటారు. అంతటి ప్రాధాన్యం గల ఆలయం వద్ద భద్రతా చర్యలు నామమాత్రంగా ఉండటం విమర్శలకు తావిస్తోంది. ఇదే అదనుగా భావించిన దుండగులు దోపిడీకి పాల్పడ్డారు.

- సంచలనం సృష్టించిన ధారాలమ్మ ఆలయంలో దోపిడీ
- నామమాత్రపు భద్రతను ఆసరాగా తీసుకున్న దుండగులు
- బంగారు, వెండి ఆభరణాల అపహరణ
- అప్రమత్తమైన పోలీసులు
- తనిఖీలు ముమ్మరం



సీలేరు సమీపంలో తుప్పల్లో పడి ఉన్న బైక్



ఆలయం పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

సీలేరు: ధారాలమ్మ ఘాట్‌లోని ధారాలమ్మ ఆలయానికి మంగళ, శుక్రవారాల్లో తాకిడి ఎక్కువగా ఉన్నందున రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుంది. మిగతా రోజుల్లో 8 గంటలకు దర్శనం నిలిపివేసి తాళాలు వేస్తారు. ఇదేవిధంగా బుధవారం రాత్రి తాళాలు వేసి పూజారి ఇంటికి వెళ్లిపోయారు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఆలయం శుభ్రం చేసేందుకు వచ్చిన కార్మికులు తాళాలు తెరిచి ఉండటం, నగదు, చిల్లర చిందరవందరగా పడి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే పరిసర ప్రాంతంలో ఉంటున్న వారికి సమాచారం అందించారు. దొంగతనం జరిగినట్టు గుర్తించిన వారు గూడెం కొత్తవీధి ఎస్ఐ అశోక్‌కుమార్‌కు వెంటనే ఫిర్యాదు చేశారు. హుటాహుటిన ఎస్ఐ రామకృష్ణ సాయంతో సంఘటన స్థలానికి ఆయన చేరుకున్నారు. సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి దొంగతనం జరిగినట్టు గుర్తించారు.

కట్టర్ సాయంతో..

ఆలయంలో ఉన్న ఇనుప రాడ్లను కట్టర్ సాయంతో కట్ చేసి దుండగులు ఆలయంలోకి ప్రవేశించినట్టు పోలీసులు నిర్ధారించారు. ముందుగా ఆలయంలోని హుండీని బద్దలుగొట్టి నగదు దోచుకున్నారు. ఈ మొత్తం సుమారు రూ.2 లక్షల వరకు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. దుండగులు అమ్మవారి మెడలోని వెండి, బంగారు ఆభరణాలను పట్టుకుపోయారు.

ఆధారాల్లేకుండా..

దోపిడీకి సంబంధించి ఆధారాలే లేకుండా దుండగులు జాగ్రత్తపడ్డారు. దీనిలో భాగంగానే సీసీ కెమెరాలు, వీటికి సంబంధించిన సీడీఆర్ పరికరాన్ని వారు పట్టుకుపోయారు. ఇదంతా అర్ధరాత్రి ఒంటి గంటల సమయంలో జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈనేపథ్యంలో సీలేరులోని తుప్పలో ధారకొండ గ్రామానికి చెందిన దారబాబు బైక్‌ను గుర్తించిన స్థానికులు ఈవిషయాన్ని పోలీసులకు తెలిపారు. అయితే దుండగులు దొంగతనం అనంతరం సీలేరు వరకు ఈ బైక్‌పై వెళ్లి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

పోలీసులు అప్రమత్తం

దోపిడీ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. జీకే వీధి సీఐ అశోక్‌కుమార్ సిబ్బందిని అప్రమత్తం చేసి వాహన తనిఖీలు చేపట్టారు. వెంటనే ఒడిశా చిత్రకొండ పోలీసులతోపాటు, చింతూరు సీఐకు కూడా సమాచారం అందించారు. ఎస్పీ సతీష్‌కుమార్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సెంట్రల్ క్రైం, వేలి ముద్రల సేకరణ బందాలు, డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించాయి.



అర్చకులు, నిర్వాహకుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

అంతా అస్తవ్యస్తం

ధారాలమ్మ ఆలయంలో రికార్డుల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా ఉందని భక్తుల నుంచి విమర్శలు వ్యక్తవుతున్నాయి. 1974లో అమ్మవారి ఆలయం ఘాట్‌లో నిర్మాణం చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు పలు రాష్ట్రాల్లో అమ్మవారికి వేల సంఖ్యలో భక్తులు ఉన్నారు. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, గిరిజనుల ఆరాధ్య దైవంగా గుర్తింపు ఉంది. ఆలయం దేవదాయశాఖకు అప్పగించి నేటికి 15 ఏళ్లు అవుతోంది. అయితే ఇప్పటి వరకు ఆలయంలో మౌలిక సదుపాయాలు కల్పన పక్కన పెడితే అమ్మవారికి సమర్పిస్తున్న వెండి, బంగారం, కానుకలు, హుండీ నగదు ఏమవుతుందనేది ప్రశ్నార్థకంగా ఉందని భక్తులు ఆరోపిస్తున్నారు.

- 2015 లెక్కల ప్రకారం 20 తులాలు బంగారం లాకర్లో ఉన్నట్లు రికార్డుల్లో ఉండగా, ఆ తర్వాత భక్తుల కానుకల రూపంలో వచ్చిన బంగారం గురించి ఎవరూ ప్రస్తావించడం లేదు. ఈ విషయం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులు సమర్పిస్తున్న బంగారం, వెండి సుమారు 50 తులాల వరకు ఉంటుందని, అదంతా ఏమవుతుందని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. హుండీ లెక్కింపు చేపట్టి దేవదాయశాఖ అధికారులు తీసుకువెళ్తున్న నగదు వివరాలు రికార్డుల్లో నమోదు కావడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జరిగిన దొంగతనంలో 19.1 గ్రాముల బంగారు ఆభరణాలను మాత్రమే పట్టుకుపోయారని దేవదాయశాఖ అధికారులు చెప్పడంతో భక్తులు ఆగ్రహానికి గురవుతున్నారు.

నిందితులను పట్టుకుంటాం: చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



అమ్మవారి ఆలయంలో దోపిడీకి పాల్పడిన నిందితులను పట్టుకుంటామని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. ఇప్పటికే భద్రాచలం, అల్లూరి జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లకు సమాచారం అందించామని ఆయన వివరించారు. నిందితులను పట్టుకుని అరెస్టు చేస్తామని ఆయన విలేకరులకు తెలిపారు.

వణుకుతున్న మన్యం

- ఏజెన్సీలో పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- చింతపల్లిలో 14.3 డిగ్రీలు..
- మినుములూరులో 15 డిగ్రీలు..
- అరకులోయలో 15.3 డిగ్రీల నమోదు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలోని కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.ఈ వారం రోజుల వ్యవధిలో ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గుముఖం పట్టడంతోపాటు చలి గాలులు విజృంభిస్తున్నాయి. గురువారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.3 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డు వద్ద 15 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డు కార్యాలయంలో 15.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఘాట్‌రోడ్డులో..

అత్యంత శీతల ప్రాంతాలుగా గుర్తింపు పొందిన పాడేరు ఘాట్‌లోని పోతురాజు స్వామి గుడి, కాఫీతోటలు, చింతపల్లి మండలం లంబసింగి, అరకులోయ మండలం సుంకరమెట్ట, జి.కె.వీధి మండలం ఆర్.వి. నగర్, జి.మాడుగుల మండలం ఈదులబయలు, పెదబయలు మండలం చుట్టుమెట్ట ప్రాంతాల్లో కూడా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో కూడా చలిగాలుల ప్రభావం ఎక్కువగా ఉంది.



అరకులోయలో ఉదయం ఎనిమిది గంటలకు దట్టంగా కురుస్తున్న పొగమంచు

పర్యాటకుల ఇబ్బందులు

మన్యంలో ఉష్ణోగ్రతలు పడిపోవడంతోపాటు చలిగాలులు విజృంభిస్తుండటంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పొగమంచు కూడా ఉదయం తొమ్మిది గంటల వరకు కురుస్తూనే ఉంది. సూర్యోదయం ఆలస్యమవుతోంది. సాయంత్రం నాలుగు గంటల నుంచి చలి ప్రభావం ఎక్కువగా ఉంటోంది. చలిమంటలు, ఉన్ని దుస్తులతో ఉపశమనం పొందుతున్నారు.

'వైద్యుడిపై తప్పుడు ఫిర్యాదులు'

అడ్డతీగల: అడ్డతీగల సామాజిక ఆరోగ్యకేంద్రంలో నిరంతరం అందుబాటులో ఉండి సేవలందించే వైద్యుడు భాస్కర్‌పై ఆదివాసీ సంఘాల పేరు చెప్పుకుని కొందరు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ళ లచ్చిరెడ్డి గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. నిరుపేద ఆదివాసీలకు వైద్యం చేస్తూ అందరి మన్ననలు అందుకుంటున్న వైద్యుడు భాస్కర్‌పై ఆస్పత్రిలోని కొందరు సిబ్బంది సహాయంతో ఐటీడీఏ పీవోకి ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. భాస్కర్‌ని పెద్దగా ఓపీ లేని ఎల్లవరం పీహెచ్‌సీలో వేయడం వల్ల అడ్డతీగలలో వైద్యసేవలు అంతగా అందని పరిస్థితి నెలకొంటుందన్నారు. అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా వైద్యుడు భాస్కర్ సేవలు అందించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో 13 మందికి జైలు

యలమంచిలి: మద్యం సేవించి వాహనాలు నడిపిన 13 మందికి ఒక్క రోజు జైలు శిక్షను మరో నలుగురికి రూ.10 వేలు చొప్పున జరిమానా యలమంచిలి ఏజెఎఫ్‌సియమ్ కోర్టు విధించినట్టు యలమంచిలి ట్రాఫిక్ ఎస్‌ఐ డి. ఈశ్వరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ ఈశ్వరావు మాట్లాడుతూ మద్యం సేవించి అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని, యలమంచిలి పరిసర ప్రాంతాల్లో యువత మద్యం తాగి వాహనాలు నడిపిన వారు జైలుకు వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరు హెల్మెట్ విధిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహన చోదకులు రికార్డులు సక్రమంగా ఉండాలని సూచించారు.

ఇసుక లారీ పట్టివేత

చోడవరం రూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్టు ఎస్‌ఐ బి.అప్పలనాయుడు తెలిపారు. గురువారం గోవాడ జంక్షన్ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా ఏపీ-05డబ్ల్యు7819 నంబరు లారీలో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తుండడాన్ని గమనించి లారీని ఇసుకతో సహా చోడవరం పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

అన్నదాతకు తెగుళ్ల బెడద

- వరి పైరుకు నష్టం కలిగిస్తున్న బాక్టీరియా ఎండుతెగులు
- పత్రహరితాన్ని తినేస్తున్న ఆకుముడత
- సస్యరక్షణ చేపట్టకుంటే దిగుబడులపై తీవ్ర ప్రభావం


చింతూరు మండలంలో బాక్టీరియా ఎండుతెగులు ఆశించిన వరి పైరు


చింతూరు ప్రాంతంలో తెగులు ఆశించిన వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి కృష్ణకాంత్

చింతూరు: అధిక వర్షాలు, వరుస వరదలతో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతను తెగుళ్ల వదలడం లేదు. వరదలు తగ్గుముఖం పట్టిన తరువాత రైతులు వ్యవసాయ పనులు చేపట్టడంతో ఖరీఫ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పైరుకు బాక్టీరియా ఎండు తెగులు, ఆకుముడత ఆశించి నష్టపరుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడిపై ప్రభావం..

చింతూరు మండలంలో ఈ ఏడాది 3,514 మంది రైతులు 10,633 ఎకరాల్లో 1064, 1061, 1121 వరి రకాల సాగు చేపట్టారు. పొట్టదశలో ఉన్న పైరకు ఎండు తెగులు, ఆకుముడత ఆశిస్తున్నాయని రైతులు తెలిపారు. బాక్టీరియా ఎండు తెగులు వల్ల ఆకులు పండిపోయి రాలిపోతున్నాయని రైతులు తెలిపారు. దీనివల్ల దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తెగుళ్ల లక్షణాలిలా..

బాక్టీరియా ఎండుతెగులు ఆశించిన పంట ముందుగా ఆకు చివర భాగం నుంచి ఎరుపుగా మారుతుంది. క్రమేపీ ఆకు మొత్తానికి ఆశించి పంటంతా ఎరుపు రంగులోకి మారుతోంది. వాతావరణం 25 నుంచి 30 డిగ్రీల సెల్సియస్, ఎక్కువ తేమశాతం, అధిక వర్షాలు, అధిక మోతాదులో నత్రజని ఎరువుల వాడకం వల్ల ఈ తెగులు ఆశించే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఆకుముడత పురుగు ఆశించి పైరు ఆకుల పత్రహరితాన్ని తినేస్తుంది. దీనివల్ల పైరు ఆహారం తయారుచేసుకునే సామర్థ్యం కోల్పోతుంది. పైరు ఎదుగుదల తగ్గిపోతుంది. అధిక నత్రజని ఎరువుల వినియోగం, నీడ అధికంగా ఉన్న ప్రదేశాల్లో పైరు ఉన్నప్పుడు దీని వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది.

సస్యరక్షణ తప్పనిసరి: ఏవో కృష్ణకాంత్

బాక్టీరియా ఎండుతెగులు, ఆకుముడత నివారణకు తప్పనిసరిగా సస్యరక్షణ చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కృష్ణకాంత్ సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో బాక్టీరియా ఎండుతెగులు, ఆకుముడత వ్యాప్తికి దోహదపడుతాయని ఆయన పేర్కొన్నారు. బాక్టీరియా ఎండుతెగులు లక్షణాలు కనిపించిన వెంటనే నివారణలో భాగంగా నత్రజని ఎరువుల వాడకం నిలిపివేయాలని సూచించారు. స్ట్రెప్టోసైక్లిన్ సల్ఫేట్, టెట్రాసైక్లిన్ 120 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 500 గ్రాములు ఎకరా పైరుకు పిచికారీ చేయాలని సూచించారు. ఏడు రోజులు గడిచిన తరువాత పైరుకు 15 కిలోల పొటాష్ లేదా కిలో మల్టీకే ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత నివారణకు సంబంధించి పురుగు ఉధృతి తక్కువగా ఉంటే ఎకరాకు క్లోరిపైరిపాస్ 500 ఎంఎల్, అధికంగా ఉంటే క్లోరాంట్రానిల్‌ప్రోల్ 60 ఎంఎల్ లేదా స్పైనోసాడ్ 60 ఎంఎల్ పిచికారీ చేయాలని ఏవో సూచించారు.

త్వరితగతిన కాఫీ ప్రాజెక్టు పనులు

పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ


కాఫీ ప్రాజెక్ట్ పనుల వివరాలు తెలుసుకుంటున్న పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న కాఫీ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన గూడెంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.4 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు. రూ.రెండు కోట్లతో భవనాల నిర్మాణం, కాఫీ పల్పింగ్ యంత్రాల కొనుగోలు చేస్తామన్నారు. మరో రూ.2 కోట్లతో ప్రహరీ, ఇతర పనులు చేపడతామన్నారు. పనుల వివరాలనుఈఈ రాజు నుంచి తెలుసుకున్నారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంలో భాగంగానే కాఫీ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామని పీవో పేర్కొన్నారు.డీఈ చాణక్య, జేఈ శ్రీనివాస్, కాఫీ ఏడీ అశోక్‌కుమార్, హెచ్‌వో అరుణకుమారి, మ్యాక్స్ డైరెక్టర్ విష్ణుమూర్తి, గోపాలరావు పాల్గొన్నారు.

జిల్లేడుపూడి శ్రీనూకాలమ్మ దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ చౌదరి మృతి

నాతవరం: జిల్లేడుపూడి శ్రీనూకాలమ్మ దేవస్థానం చైర్మన్, ప్రముఖ కాంట్రాక్టర్ ఎం.ప్రభాకర్ చౌదరి (76) గురువారం రాత్రి అనారోగ్యంతో ఇంటి వద్దే మరణించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నీరు అందించేందుకు 1987లో నిర్మించిన ఏలేరు కాలువ సారంగం తవ్వకం కాంట్రాక్టరుగా నాతవరం మండలం జిల్లేడుపూడిలో అడుగుపెట్టారు. ఏలేరు కాలువ పనులు పూర్తయ్యాక ఆయన ఇక్కడే స్థిరపడిపోయారు. నాతవరం, నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, కోటవురట్ల మండలాల్లో అనేక గ్రామాల్లో దేవాలయాలు నిర్మించేందుకు ఆర్థిక సాయాన్ని అందించారు. ఈ ప్రాంతంలో పలుచోట్ల జీడిపిక్కల ఫ్యాక్టరీలు నిర్మించి ఎంతోమంది మహిళలకు, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించారు. శ్రీనూకాలమ్మ తల్లి ఆలయం నిర్మించిన 1989 సంవత్సరం నుంచి ప్రతి ఏటా కొత్త అమావాస్య పండగను ఘనంగా నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణించినప్పుడు 11వ రోజున భారీ అన్నదానం చేశారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర చేపట్టినప్పుడు పలు గ్రామాల్లో 15కు పైగా వైఎస్సార్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రభాకర్ చౌదరి ఇష్టమైన ప్రాంతం జిల్లేడుపూడిలోనే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుమార్తె జయలీల ఫోన్‌లో తెలిపారు. కుటుంబ సభ్యులంతా హైదరాబాద్ నుంచి శుక్రవారం ఉదయానికి జిల్లేడుపూడి చేరుకుంటారన్నారు.


ప్రభాకర్ చౌదరి (ఫైల్)

వెంకన్నపాలెంలో పట్టపగలు చోరీ


దొంగలు తెరచిన బీరువా


పెకలించిన కిటికీ

చోడవరం రూరల్: వెంకన్నపాలెం పంచాయతీ పరిధిలోని పాముల వారి వీధిలో ఉంటున్న చదరం రామకోటి ఇంటిలో గరువారం పట్టపగలు భారీ చోరీ చోటు చేసుకుంది. సుమారు నాలుగున్నర లక్షల రూపాయల విలువ చేసే నగదు, బంగారు నగలు, వెండి వస్తువులు దొంగిలించారు. చదరం రామకోటి భార్య ప్రమీల రాణి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తుంది. ఆమె కార్యాలయ విధులకు వెళ్లారు. పిల్లలు ఇద్దరూ చోడవరంలోని ఒక ప్రైవేటు స్కూలులో చదువుకుంటున్నారు. రాయపురాజుపేట గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద చీటీ వేసుకున్న రామకోటి పాటపాడిన మీదట చీటీ మొత్తం ముప్పై వేల రూపాయలను తీసుకుని వచ్చి ఇంట్లో బీరువాలో దాచిపెట్టారు. మధ్యాహ్నం పిల్లలకు భోజన కేరేజీలను అందచేయడానికి చోడవరం వెళ్లారు. ఆ సమయంలో వంటగదికి ఉన్న రెండు అడుగుల వెంటిలేషన్ కిటికీని తొలగించి దొంగ ఇంట్లో దూరాడు. చోడవరం నుంచి తిరిగి వచ్చిన రామకోటి ఇంట్లోకి వెళ్లి చూసే సరికి బీరువా తెరచి ఉండి బట్టలు చిందరవందరగా ఉండడంతో, చీటి పాడిన మొత్తం ముప్పై వేల రూపాయల నగదుతోపాటు, మూడు తులాల బంగారు వస్తువులు, రెండున్నర కేజీల బరువు ఉండే వెండి వస్తువులు చోరీకి గురైనట్టు గమనించి గొల్లుమన్నారు. రామకోటి భార్య ప్రమీల రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ బి.అప్పలనాయుడు చోరీ జరిగిన ఇంటిని సందర్శించి విచారణ చేపట్టారు. దొంగల ఆచూకీ తెలుసుకోవడానికి క్లూస్ టీమ్‌తో పాటు, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

కొత్త చట్టాలతో ఆదివాసీల మనుగడకు ముప్పు


సమావేశంలో మాట్లాడుతున్న టాన్యా

రంపచోడవరం: కొత్త అటవీ చట్టాలతో ఆదివాసీ మనుగడను ముప్పు ఏర్పడుతుందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.టాన్యా అన్నారు. రంపచోడవరంలో గురువారం ఆదివాసీల రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన కొత్త నియమాలను ఐక్యంగా అడ్డుకోవాలన్నారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్టిపాటి వెంకటశ్వర్లు మాట్లాడుతూ అంతర్జాతీయ, జాతీయ బహుళజాతి కంపెనీల నుంచి వస్తున్న ఒత్తిళ్లకు మోదీ ప్రభుత్వం తలొగ్గి ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను సవరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.అశోక్, సోమరాజు, దూలన్న, పల్లాల లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలో అన్ని పీహెచ్‌సీల పరిధిలోని గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యాధికారులను ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. ఐటీడీఏ సమావేశం హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీహెచ్‌సీల పరిధిలోని గర్భిణులను ప్రసవానికి 15 రోజుల ముందే ఆస్పత్రుల్లో చేర్పించాలని తెలిపారు. అందుకు ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నెలా పీహెచ్‌సీలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, ఎంత మంది గర్భిణులు బర్త్ వెయింటింగ్ హాల్‌లో ఉంటున్నారు, గర్భిణులకు ఎటువంటి ఆహారం ఇస్తున్నారు తదితర అంశాలపై వైద్యాధికారులతో చర్చించారు. గర్భిణుల్లో రక్తహీనత నివారించేందుకు ఐరన్ మాత్రలు, పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గర్భిణికి ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ ఉండాలని తెలిపారు. పీఎం మాతృత్వ వన్‌ధన్ యోజన కోసం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న వారికి వెంటనే రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు.108, 104 సేవలపై చర్చించారు. ఈ సమావేశంలో ఏడీఎంహెచ్‌వో అనూష, వైద్యాధికారులు రాధిక, షర్మిల, సాయి రతన్, శ్రీదుర్గా, హెచ్‌ఈవో పీటర్ , శకుంతల తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో గిరిజన ఉత్పత్తుల అమ్మకాలు

- నవంబర్ 1 నుంచి ప్రయోగాత్మకంగా అమలు
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్


అధికారులతో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్, జేసీ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం: రేషన్ దుకాణాలు, మొబైల్ రేషన్ వాహనాల ద్వారా నవంబరు 1 నుంచి గిరిజన ఉత్పత్తులు అమ్మకాలు చేపట్టనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ వెల్లడించారు. గిరిజన సహకార సంస్థ అధికారులు, రేషన్ డీలర్లు, మొబైల్ వాహన ఆపరేటర్లు, వినియోగదారుల సంఘాలు, పౌరసరఫరాల శాఖాధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులకు ఆర్థిక పరిపుష్టిత చేకూర్చేందుకు రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా గిరిజన ఉత్పత్తుల అమ్మకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అందరికీ అందుబాటు ధరల్లో అమ్మకాలు జరిపి వారి ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశ్ రావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వంజంగి హిల్స్‌పై టోల్‌గేటు

సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్ రక్షణ చర్యల్లో భాగంగా పోలీసు శాఖ టోల్‌గేటును గురువారం ప్రారంభించింది.

ఇక్కడ వంజంగి పంచాయతీ పరిధిలోని ఏడుగురిని పోలీసు వలంటీర్లుగా ఎస్పీ సతీష్‌కుమార్ నియమించారు. సాయంత్రం 5గంటల నుంచి మరుసటి రోజు తెల్లవారుజాము 3గంటల వరకు వాహనాల రాకపోకలను నిషేధిస్తూ పోలీసుశాఖ ఆదేశాలిచ్చింది. వంజంగి కొండపై మద్యం, ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించింది. పర్యాటకులంతా పోలీసు నిబంధనలకు సహకరించాలని కోరింది.

శీతాకాలం..అప్రమత్తతే ప్రధానం

- దట్టంగా కురుస్తున్న మంచు
- పెరుగుతున్న అనారోగ్య సమస్యలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


ముంచంగిపుట్టులో కురుస్తున్న మంచు

ముంచంగిపుట్టు: శీతాకాలం మొదలు కావడంతో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. శీతల గాలులకు తోడు తెల్లవారు జామున, రాత్రి వేళల్లో మంచు విపరీతంగా కురుస్తుండడంతో ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. అప్రమత్తంగా లేకుంటే సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి.రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవాళ్లు మంచులో తిరగకూడదు.

శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నెలల బిడ్డలు తల్లి పొత్తిళిలో ఎక్కువ సమయం ఉండేలా చూసుకోవాలి.
- ఏడాది లోపు పిల్లలకు చలిగాలి తగలకుండా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి.చలితో ఫిట్స్ వచ్చే ప్రమాదముంది.
- ప్రయాణాల్లో చిన్నపిల్లల శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచాలి.
- అస్తమా రోగులు ఆయాసం రాకుండా ముందే మందులు వేసుకోవాలి.బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్కులు ధరించాలి.చలిలో తిరగడం,చల్లటి నీరు తాగడం చేయకూడదు.
- ఉదయం వాకింగ్ వెళ్లేవారు మఫ్లర్, స్వెటర్‌తో పాటు షూ వేసుకోవాలి.చేతులకు గ్లౌజ్‌లు ధరించాలి.
- వ్యాయామం చేయడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రత పెరుగుతుంది.చెమట బయటకు వచ్చి చర్మం పొడిబారకుండా ఉంటుంది.
- విటమిన్-సి లభించే జామ,ఉసిరి,నిమ్మ,ద్రాక్ష,క్యాబేజీ,క్యాప్సికం,టమాటా వంటివి తీసుకోవడంతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. మధుమేహం ఉన్నవారు పాదాలు పగలకుండా బూట్లు వేసుకోవాలి.గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు విధిగా మందులు వాడాలి.

జాగ్రత్తగా ఉండాలి



శీతాకాలంలో ఆరోగ్య రక్షణలో జాగ్రత్తగా ఉండాలి.వాతావరణ మార్పులతో వైరల్ జ్వరాలు,గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఆస్తమా,శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలి.పిల్లలు నిద్రించే గదిలో తగినంత వేడి ఉండేలా చూసుకోవాలి.ఐదేళ్లలోపు పిల్లలకు స్వెటర్లు,ఉన్ని దుస్తులు వేయాలి.అనారోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–ఎస్.రమేష్, వైద్యాధికారి,కిలగాడ పీహెచ్‌సీ, ముంచంగిపుట్టు మండలం.

31న విద్యార్థి భేరి

- మూడు రాజధానులకు మద్దతుగా చోడవరంలో భారీ ర్యాలీ నిర్వహణకు సన్నాహాలు
- సభా ప్రాంగణాన్ని పరిశీలించిన జేఏసీ ప్రతినిధులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


విద్యార్థి భేరి నిర్వహించే ప్రాంతాలను జేఏసీ ప్రతినిధులతో కలిసి పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: మూడు రాజధానులకు మద్దతుగా ఈనెల 31వ తేదీన చోడవరంలో భారీ విద్యార్థి భేరి నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, సాధన కమిటీ జేఏసీ కన్వీనర్ కాండ్రేగుల డేవిడ్ తెలిపారు. విద్యార్థి భేరి నిర్వహించతలపెట్టిన చోడవరం ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌ను జేఏసీ ప్రతినిధులు, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఉత్తరాంధ్ర విద్యార్థుల ఆవేదన ఈ విద్యార్థి భేరి ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ తెలిసే విధంగా భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఈనెల 31వ తేదీన ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణం నుంచి వేలాది మంది విద్యార్థులతో కలిసి మెయిన్‌రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించి, సభాప్రాంగణానికి చేరుకుంటామన్నారు. సుమారు 10 వేల మంది విద్యార్థులు ఈ భేరీలో పాల్గొంటారని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందకుండా కొన్ని దుష్ట శక్తులు అడ్డుకుంటున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎందరో విద్యార్థులు హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు ఉద్యోగ, ఉపాధి కోసం వలసపోతున్నారని పేర్కొన్నారు. విశాఖను పరిపాలన రాజధాని చేయడం వల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెంది విద్యార్థులకు చదువు పూర్తయిన వెంటనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడేందుకు వీలు కలుగుతుందన్నారు. విశాఖలో రాజధాని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనే నినాదంతో విద్యార్థులంతా కలిసి విద్యార్థి భేరి నిర్వహిస్తున్నారన్నారు. ఈ భేరికి పెద్దసంఖ్యలో విద్యార్థులంతా తరలి రావాలని జేఏసీ పిలుపునిచ్చింది. జేఏసీ ప్రతినిధులు డాక్టర్ బండారు సత్యనారాయణ, ఆర్క్ ప్రసాద్, టీవీరమణ, న్యాయవాది వేచలపు వెంకట్రావు,నాగులాపల్లిరాంబాబుపాల్గొన్నారు.

క్లుప్తంగా

చింతపల్లి సీఐగా రమేష్ బాధ్యతల స్వీకరణ



చింతపల్లి రూరల్: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కె.రమేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన శ్రీకాకుళం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జ్ సీఐగా సన్యాసి నాయుడు పనిచేశారు. ఆయనను ఎస్పీ కార్యాలయానికి ఎటాచ్ చేశా రు. సీఐ రమేష్ మాట్లాడుతూ మన్యంలో పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆలీ పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ రామన్నకు పరామర్శ



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అరకులోయ రూరల్: వైస్ ఎంపీపీ కిల్లో రామన్నను, ఆయన కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించారు. బస్కి పంచాయతీ బొండగుడలో బుధవారం రామన్న తండ్రి కిల్లో డొంబు(62)మృతి చెందారు. దీంతో ఆ గ్రామానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తిన కుమార్(శ్రీను)ఎంపీటీసీలు రాంచందర్, భీమరాజు,సత్రుగున్,నాయకులు నర్సింగ్,నాగేశ్వరరావు,అర్జున్,రంజిత్‌కుమార్, గురు,నొబో,రామ్మూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి రోడ్లు, కల్వర్టుల సమస్యలు



కల్వర్టును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అరకులోయ రూరల్: మండలంలోని రోడ్లు, కల్వర్టుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లనున్నట్టు మార్కెట్ కమిటీ చైర్మన్ కిల్లో రాజా రమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తిన కుమార్(శ్రీను) తెలిపారు. మండలంలో బస్కి, మాడగడ, సుంకరమెట్ట పంచాయతీల సరిహద్దుల్లోని శివారు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న రోడ్లు, కల్వర్టులను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు రహీంతుల్లా,ఎంపీటీసీ సభ్యులు సత్రుగున్, రాంచందర్, భీమరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామూర్తి, అర్జున్,గురు, నర్సింగ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

66 మందికి వైద్య సేవలు

హుకుంపేట: మండలంలోని గడికించుమండ పంచాయతీ కేంద్రంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ సుమన ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 66 మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ శీతాకాలం ప్రారంభం కావడంతో చలి తీవ్రత పెరిగిందని జలుబు, జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని చెప్పారు. తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్ సదానందం, సిబ్బంది అశ్విని,వంశీ,వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ రాము మృతికి సంతాపం

పాడేరు రూరల్ : ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నర్సీపట్నానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రాము మృతిపై పాడేరు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడు బి.నాగరాజు, పాడేరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.ఎం.కొండబాబు, ప్రధాన కార్యదర్శి కొంటా దుర్గారావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొంగమల్లి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వి.జోషి, ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకుడు పెంటకోట సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు సంతాపం తెలిపి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- పాడేరు, పెదబయలు, రాజవొమ్మంగి మండలాల్లో గడపగడపకు మన ప్రభుత్వం



అంపూరు గ్రామంలో ప్రభుత్వ పథకాలు పొందిన గిరిజనులకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



గలగండలో గిరిజనుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



బోనంగిపాలెంలో సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

సాక్షి,పాడేరు: పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తూ జిల్లాలోని పేద గిరిజనుల జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని గబ్బంగి పంచాయతీలో కొత్తూరు, కురిడిమెట్ట, చీడిమెట్ట, అంపూరు, దేవారపల్లి, దాలెంపుట్టు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా లబ్ధిపొందిన గిరిజనులతో మాట్లాడారు. పథకాల కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వ్యక్తిగత, గ్రామాల సమస్యలపై ఆమె ఆరా తీశారు. తాగునీటి పథకాలకు సంబంధించిన సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడి నుంచే ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు మంచి జరిగిందన్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులకు అందజేసే పింఛన్ నగదు పెంచడంతో పాటు, ఒకటో తేదీనే నేరుగా ఇంటికి వద్ద వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తూ ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని చెప్పారు. విద్యా,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి నాడు–నేడు ద్వారా పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేస్తూ మౌలిక సదుపాయాలు కల్పించిందని తెలిపారు. పాడేరులో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు కూడా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని, ఎప్పుడు ఎన్నికలొచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గొల్లోరి నీలకంఠం, సీదరి రాంబాబు, వంతాల రాంబాబు, సన్నిబాబు, బసవన్నదొర, ఎంపీటీసీలు డి.సన్యాసిరావు, రామకృష్ణపాత్రుడు, నర్సింహమూర్తి, చిట్టమ్మ, మాజీ ఎంపీపీ సీదరి మంగ్లన్నదొర, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్‌పర్సన్ సరస్వతి, పార్టీ నాయకులు కోడా సుశీల, దశమూర్తి, రామసత్యవతి, ఊర్వశి రాణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ జగనన్న ప్రభుత్వం
– ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: సంక్షేమం,అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ జగనన్న ప్రభుత్వమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని గలగండ పంచాయతీ ఈదులపుట్టు,మంగబంద, కూతంగిపుట్టు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతీ గ్రామంలోనూ గిరిజనులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులకు అందుతున్నాయా,లేదా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ పథకాల గురించి వివరించారు. కుతంగిపుట్టులో రూ.5 లక్షలు, ఈదులపుట్టులో రూ.3.15 లక్షలు, మంగబందలో రూ.4.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు,అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. ప్రజల యోగక్షేమాలను,వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలన్నీ టీడీపీ నాయకులకే అందేవని,వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులమత,పార్టీలకు అతీతంగా అర్హతే ప్రమాణికంగా పథకాలు అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కూడా బొంజుబాబు, రాష్ట్ర అగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, వైస్ ఎంపీపీ కె.రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, సీకరి ఎంపీటీసీ వంతాల ఆనందరావు, సర్పంచ్‌లు లోహిదాసు,సురేష్,మత్స్యరాజు,చిన్నారావు,మత్స్యలింగం,ఎంపీటీసీ అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మెరుగైన పాలన
– రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: గతంలో ఏ ప్రభుత్వం అందివ్వని మెరుగైన పాలనను వైఎస్సార్‌సీపీ అందిస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. మండలంలోని గడుఓకుర్తి పంచాయతీలోని గొబ్బిలమడుగు, బోనంగిపాలెం, బూడిదవారి చేను మఖాలు, పంచాయతీ హెడ్‌క్వార్టర్ గడుఓకుర్తి, చీడిపాలెం, బూసులపాలెం, చైతన్యనగర్, కింద్ర పంచాయతీలోని లోదొడ్డి, అనంతగిరి గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి పేరుపేరున గిరిజనులను పలకరించి, వారి యోగక్షేమాలు, సమస్యలు తెలుసుకొన్నారు. తమ గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా గ్రామస్తులు నీరాజనాలు పట్టారు. ఉదయం 10 గంటలకు మొదలైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం సాయంత్రం వరకు సాగింది. గడచిన మూడేళ్లలో ప్రతి కుటుంబానికి అందిన పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ అందజేసిన కరపత్రాలను పంపిణీ చేశారు.

తమకు పథకాలన్నీ అందుతున్నాయని గిరిజనులు సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కేంద్రం గడుఓకుర్తిలో తాగునీటికి కటకట లాడుతున్నామని గిరిజన మహిళలు వాపోయారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి వేయిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు కోరారు. ప్రభుత్వ అమలుచేస్తున్న సంక్షేమపథకాల నగదును తమ ఖాతాల నుంచి జడ్డంగి బ్యాంకు ఆఫ్ ఇండియా అధికారులు పాతబకాయిలు ఉన్నాయంటూ కట్ చేసుకొంటున్నారని రైతులు వాపోయారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సవిరెల చంద్రుడు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, ఉప సర్పంచ్ పొత్తూరి రమాదేవి, సర్పంచ్‌లు దాసరి నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఆగూరి శుభలక్ష్మి, చీడి శివ, నాయకులు అడపా కామేష్, సింగిరెడ్డి రవి, రమేష్‌బాబు, డీటీ సత్యనారాయణ, వెటర్నరీ డాక్టర్ తరుణ్, ఏపీవో సురేష్ పాల్గొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పోలీస్‌శాఖ అడుగడుగునా భద్రత కల్పించింది.మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకున్నారు.

పంట నమోదుతో రైతులకు మేలు



పంట నమోదు వివరాలను తెలుసుకుంటున్న ఏవో మోహన్‌రావు

ముంచంగిపుట్టు: పంట నమోదుతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి పి.మోహన్‌రావు తెలిపారు. మండలంలోని కిలగాడ,బంగారుమెట్ట,దార్రెల,కుమాడ పంచాయతీల్లో గురువారం వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి, పంటలు పరిశీలించారు. పంట నమోదుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు మాట్లాడుతూ పంట నమోదు ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేసినట్టు చెప్పారు. మండలంలో వరి 8,379 ఎకరాలు, రాగులు 4,762, సాములు 7,484, పసుపు 1,375, కందులు 208 ఎకరాల్లో సాగుచేస్తున్నట్టు చెప్పారు. మండలంలో వేసిన పంటలను పరిశీలించి, సర్వే నంబర్ సక్రమంగా ఉందో లేదో గుర్తించి జిల్లా అధికారులకు పంపించనున్నట్టు చెప్పారు. పంట నమోదు చేసుకోలేని వారి జాబితాను గ్రామ సచివాలయంలో అందుబాటులో ఉంచామని, ఆ రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలి

ముంచంగిపుట్టు: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో భాషాపండితులు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రేగం సూర్యనారాయణ డిమాండ్ చేశారు.ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సంఘం సభ్యత్వ నమోదులో భాగంగా రాష్ట్ర,జిల్లా ప్రతినిధులు గురువారం మండల కేంద్రంతో పాటు లబ్బూరు, పనసపుట్టు,లక్ష్మీపురం,పెదగూడ,బంగారుమెట్ట,కిలగాడ గ్రామాల్లో ఆశ్రమ పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులతో సభ్యత్వం నమోదు చేయించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నాణ్యమైన విద్యా బోధనకు అందరూ కలిసి కృషి చేయాలన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించి రెండవ ఎంఈవో పోస్టులో నియమించాలని కోరారు.

పీవో దృష్టికి గురుకుల ఉద్యోగుల సమస్యలు



రంపచోడవరంలో పీవోను కలిసి యూనియన్ నాయకులు

రంపచోడవరం: ఏజెన్సీలోని గురుకుల ఉద్యోగుల సమస్యలు పరిష్కారించాలని ఏపీ గిరిజన గురుకుల విద్యాలయ నాన్ టీచింగ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు హరి కోరారు. రంపచోడవరం ఐటీడీఏ పీవోను గురువారం ఆయన కలిశారు. సమస్యలను పీవో దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సూర్యరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదే రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన



రహదారి పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

అనంతగిరి:మండలంలోని వాలసీ పంచాయతీ జెండగరువు నుంచి ఊటగెడ్డ గ్రామం వరకు రూ.1.20 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన రహదారి పనులను జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు పరిశీలించారు. రహదారి నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. జెడ్పీ సమావేశంలో ఈ రహదారి సమస్యపై విన్నవించిన వెంటనే జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పరిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సన్యాసిరావు, ఏఈ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని అనకాపల్లికి చెందిన గురూజీ శివశక్తి తెలిపారు. స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో గురువారం భక్తులకు శ్వాసపై ధ్యాస, శరీరంలో ఉండే 72వేల నాడులను ఉత్తేజపరచడం ఎలా వంటి అంశాలను వివరించారు. అనంతరం దాతల సహకారంతో ఆలయకమిటీ భారీ అన్నదానం నిర్వహించింది.

గిరిజన మ్యూజియం, గ్రామ దర్శిని సందర్శన



అరకులోయ గిరిజన మ్యూజియంను సందర్శించిన డిగ్రీ విద్యార్థులు

అరకులోయ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాలల తృతీయ సంవత్సరం విద్యార్థులు అరకు లోయలోని పలు ప్రాంతాలను గురువారం సందర్శించారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా గిరిజన మ్యూజియం, గిరి గ్రామదర్శిని ప్రాంతాలను సందర్శించి, అక్కడ ఉద్యోగులు, కార్మికులు నిర్వహిస్తున్న విధులు, చేపడుతున్న పనుల గురించి ప్రత్యక్షంగా విద్యార్థులు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, డాక్టర్ సీహెచ్ రామకృష్ణలు పర్యవేక్షించారు. ఈ సందర్శనలో వైస్ ప్రిన్సిపాల్ కె.పద్మలత, ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, మ్యూజియం సూపర్‌వైజర్ గణపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



పోటీలను పరిశీలిస్తున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: మండలంలోని గిరిజన సంక్షేమశాఖ బాలికల ఆశ్రమ,బాలుర పాఠశాలల విద్యార్థినీవిద్యార్థులకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహించినట్టు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళాపోలీసులు ఈశ్వరి,సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేతో రైతులకు మేలు



భూముల రీ సర్వేను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ సుమంజాలి

అరకులోయ రూరల్: వైఎస్సార్ జగనన్న భూ రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని వైస్ ఎంపీపీ సుమంజాలి అన్నారు. సుంకరమెట్ట పంచాయతీ లింబగుడ గ్రామంలో గురువారం భూ రీ సర్వే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి, వైస్ సర్పంచ్ ఆశలత, ఆర్ఐ నారయణ, వీఆర్వోలు అమ్మలు, కళ్యాణ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భాషా విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలి

అరకులోయ రూరల్: భాషా విద్యా వలంటీర్లను రెన్యువల్ చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు.అరకులోయ,అనంతగిరి,డుంబ్రిగుడ మండలాల పరిధిలో పనిచేస్తున్న భాషా విద్యా వలంటీర్లు స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు కుమారి మాట్లాడుతూ రెన్యూవల్ చేయకపోతే నవంబర్ 1 నుంచి దశలవారీగా ఆందోళనలు చేపడతామన్నారు.

నాడు- నేడు పనులపై నిరంతర పర్యవేక్షణ



వెదుళ్లకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వంటషెడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

అడ్డతీగల: నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఎంఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని వెదుళ్లకొండ, వంగలమడుగు గ్రామాల్లోని పాఠశాలల్లో వంటషెడ్ల నిర్మాణ పనులతో పాటు రాయపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న అదనపు భవనాల నిర్మాణ పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశిత సమయానికి నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు కావాలి



ఓటర్లు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పైడిపనుకులలో పట్టభద్రులతో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

డుంబ్రిగుడ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు వీలుగా పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావాలని గుంటసీమ సర్పంచ్ నాగేశ్వరరావు కోరారు. మండలంలోని గుంటసీమ, అరకు, కించుమండ, కొల్లాపుటు గ్రామాల్లో గురువారం ఆయన యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరానికి ముందు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు.

కొయ్యూరు: పట్టభద్రులైన వారంతా విధిగా ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ గిరిజన మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు కురుసా ఉమామహేశ్వరరావు కోరారు. రాజేంద్రపాలెం, రత్నంపేట, వైస్ పాకల, రేవళ్ల,పైడిపనుకుల, తుమ్మలబంద, మంప గామాల్లో ఆయనతో పాటు బీజేపీ నేతలు పర్యటించారు. పలువురు పట్టభద్రులను కలిసి ఓటర్లుగా నమోదు కావాలని కోరారు. గిరిజన మోర్చ నేతలు బి.వి. భారతి, ఓసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కె. సుబ్రహ్మణ్యం,గిరిజన మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిమెల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు



హెచ్ఎంను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ కామేశ్వరి

ఎటపాక: ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంపీపీ కాక కామేశ్వరి తెలిపారు.మండలంలోని పినపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ఈసందర్భంగా పదవ తరగతిలో విద్యాబోధనను ఆమె పరిశీలించారు. బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు.పలు సబ్జెక్టులకు టీచర్స్ లేరని హెచ్ఎం పుల్లయ్య తెలపడంతో ఎంఈవోతో ఎంపీపీ ఫోన్లో మాట్లాడి ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని చెప్పారు.ఎంపీపీ వెంట గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట్రామిరెడ్డి, సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఇరప అజయ్,రమేష్,ఏడుకొండలు,వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం

అనంతగిరి: మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ మెట్టపాలెంలో కె.జమ్మయ్య, సోమయ్య అనే గిరిజనులకు చెందిన రెండు పూరిళ్లు బుధవారం దగ్ధమయ్యాయి. గురువారం సర్పంచ్ అప్పారావు, వీఆర్వో శంకరరావులు ఆ గ్రామానికి వెళ్లి ప్రమాదంపై ఆరా తీశారు. ప్రభుత్వం తరఫున సాయం అందేలా చూస్తామని వారు తెలిపారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ

వై.రామవరం: మండలంలోని దేవరమడుగుల గ్రామ సచివాలయంలో గురువారం ప్రజా ప్రతినిధుల చేతులమీదుగా కుల, ఆదాయ, ఎఫ్ఎంసీ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. సర్పంచ్ ముత్యాల నూకరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని 18 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో గుడ్ల రాజు, వీఆర్ఏ గొర్లె చిన్నబ్బులు, ఉపసర్పంచ్ కుర్సం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై వేధింపులు ఆపాలి

మారేడుమిల్లి : సచివాలయ ఉద్యోగులపై ఉన్నతాధికారుల వేధింపులను ఆపాలని ఆర్బీకే ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. విజయ్ మోహన్, ఉపాధ్యక్షుడు పి.ప్రవీణ్ కోరారు. మారేడుమిల్లి మండలం గజ్జుమామిడి వలస గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ విశ్వనాథ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నేపథ్యంలో రంపచోడవరం ఏడీఏ కె.వి.వి చౌదరికి వారు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉన్నాధికారుల వేధింపుల వల్ల సచివాలయ ఉద్యోగి విశ్వనాథ్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు చెప్పారు. కిందస్థాయి ఉద్యోగులపై ఉన్నాతాధికారుల పక్షపాత వైఖరిని మానుకోవాలని గిరిజన నాయకులు వెదుళ్ల లచ్చిరెడ్డి, గొర్లె చిన్న నారాయణ రావు, గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), గరిడే బాబురావు వేరేగా కోరారు.